నేడు యధావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్ సోమవారం యథావిధిగా జరగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కలెక్టర్ కార్యాలయంలో, రెవెన్యు డివిజనల్, మున్సిపల్, మండల స్థాయిలో ఈ కార్యక్రమం యథావిధిగా జరగుతుందన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. అర్జీలను క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండే డివిజనల్, మున్సిపల్, మండల స్థాయి అధికారులకు అందించాలన్నారు. అర్జీ దారులు వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు రానవసరం లేదన్నారు. అర్జీలను ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్, ఎంపిడిఒ ఇతర ఇతర మండల స్థాయి అధికారులకు అందించాలన్నారు. పిజిఆర్‌సకు అధికారులు అందరూ అందుబాటులో ఉంటారన్నారు.

వణుకుతున్న జిల్లా

- క్రమంగా పెరుగుతున్న చలి తీవ్రత
- పొగ మంచుతోనూ అవస్థలు
- ఉన్నిదుస్తులకు పెరిగిన డిమాండ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

చలిపులి పంజాకు జిల్లా వణుకుతోంది. రాత్రి ఉష్ణోగ్రతలతో క్రమంగా పడిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. చలికి తోడు శీతలగాలుల తీవ్రత ఎక్కువైంది. వారం రోజుల్లో రాత్రి ఉష్ణోగ్రతలు ఒక్కసారికిగా 4 నుంచి 6 డిగ్రీల వరకూ పడిపోయాయి. ఫలితంగా చలితో జిల్లా వణుకుతోంది.

రోజు రోజుకూ తీవ్రత పెరగడంతో ప్రజలు వణికిపోతున్నారు. వారం రోజుల క్రితం జిల్లాలో సరాసరి పగటి ఉష్ణోగ్రత 30 డిగ్రీలుగా నమోదు కాగా రాత్రి ఉష్ణోగ్రతలు 21 డిగ్రీలకు పడిపోయాయి. గత మూడు రోజుల నుంచి రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలోపు నమోదయ్యాయి. 15 రోజుల క్రితం కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25 డిగ్రీల వరకు ఉండగా వారం రోజుల్లో గణనీయంగా పడిపోయాయి. మరో వైపు ఉదయం వేళల్లో పొగ మంచు ఉదయం 10 గంటలవరకూ కమ్మేస్తోంది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం వేళల్లో చలిగాలుల తీవ్రత ఎక్కువయ్యింది. చలితో పాటు శీతలగాలులు వీస్తుండటంతో చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఉబ్బసం, జలుబు, తదితర శ్వాసకోశ వ్యాధులు ఉన్నవారు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. చలిగాలులు వీస్తాయని, రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతాయని వాతావరణశాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. కోనసీమ ప్రాంతంలోని సఖినేటిపల్లి, అంతర్వేది, మలికిపురం మండలాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. కాకినాడ జిల్లా రౌతులపూడి, కోటనందూరు, యు.కొత్తపల్లి, తొండంగి మండలాల్లో ఉదయం 11 గంటలైనా చలి తీవ్రత తగ్గట్లేదు. సముద్ర తీర ప్రాంతాలను పొగమంచు కప్పేస్తుంది.

కోనసీమలో కప్పేసిన పొగ మంచు

వారం రోజులు నమోదైన ఉష్ణోగ్రతలు

తేదీ	గరిష్టం	కనిష్టం
24.11.24	32.2	21.2
23.11.24	32.1	20.0
22.11.24	31.0	21.0
21.11.24	31.5	23.1
20.11.24	32.7	23.2
19.11.24	32.4	24.8
18.11.24	34.1	25.2

ఉష్ణోగ్రతలు డిగ్రీల్లో

వృద్ధులు, చిన్నారులపై తీవ్ర ప్రభావం

చలి తీవ్రత వృద్ధులు, చిన్నారులపై ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. చలి నుంచి కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. స్వెటర్లు, ఊలు టోపీలు, రగ్గులు, జర్కిన్లు వంటివి ధరించాలని చెబుతున్నారు. చర్మ పొడిబారి చర్మ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, దీని నుంచి కొబ్బరి నూనెను రాసుకోవాలని సూచిస్తున్నారు. లేదా మార్కెట్‌లో లభించే లోషన్లను నాణ్యతగలవి రాసుకోవాలన్నారు. అయినప్పటికీ చర్మ వ్యాధులు తగ్గకపోతే డాక్టర్‌ను సంప్రదించాలని సూచిస్తున్నారు. చలి తీవ్రత పెరిగే న్యూమోనియా వంటివి వస్తాయన్నారు. దగ్గు, రొంపలతో శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులు వస్తాయన్నారు. ఆవిరి పట్టుకుంటే కొంత ఉపశమనం పొందే అవకాశం ఉందన్నారు. చలిలో చిన్నారులు, వృద్ధులు తిరగకుండా చూసుకోవాలన్నారు.

రాజమహేంద్రవరంలో ఉన్ని దుస్తుల దుకాణం

పిఠాపురంలో చలిమంట వద్ద చిన్నారులు

ఉన్ని దుస్తులకు పెరిగిన డిమాండ్

చలి తీవ్రత పెరుగుతుండటంతో ఉన్ని దుస్తులకు డిమాండ్ పెరిగింది. ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల ఉన్ని దుకాణాలు వెలశాయి. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్‌లకు చెందిన చిరువ్యాపారులు ఇక్కడ తాత్కాలిక షాపులను ఏర్పాటు చేసుకుని ఉన్ని దుస్తులను విక్రయిస్తున్నారు. చలి తీవ్రత పెరగడంతో కొనుగోళ్లు పెరిగాయని వారు చెబుతున్నారు. రూ.200 నుంచి రూ.4వేల వరకూ విలువ చేసే ఉన్ని దుస్తులు వీరి వద్ద అందుబాటులో ఉన్నాయి. స్వెటర్లు, గ్లౌజులు, మంకీ క్యాప్‌లు, రగ్గులు, బెడ్‌షీట్లు, జర్కిన్లు ఇలా పలురకాల దుస్తులు అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకూ అందుబాటులో ఉన్నాయి. అందుబాటు ధరల్లో దొరకడంతో సామాన్యులు ఎక్కువగా వీటివైపు మొగ్గుచూపుతున్నారు. ఇదిలా ఉండగా పల్లెలో ప్రజలు మంటలు వేసుకుని చలి నుంచి ఉపశమం పొందుతున్నారు.


బొడ్డును సత్కరిస్తున్న మంత్రి దుర్గేష్

రుడా ఛైర్మన్‌గా బొడ్డు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం, కోరుకొండ

రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) ఛైర్మన్‌గా బొడ్డు వెంకటరమణచౌదరి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. చెరుకూరి కళ్యాణ మండపంలో జరిగిన ప్రమాణస్వీకారోత్సవ సభలో ఆయన మాట్లాడారు. టిడిపి శ్రేణుల వల్లే తనకు ఈ పదవి వచ్చిందన్నారు. రానున్న 40ఏళ్లలో రాజమహేంద్రవరం అభివృద్ధి దృష్టిలో ఉంచుకుని రుడా మాస్టర్ ప్లాన్ రూపొందించడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. ఒక వైపు అభివృద్ధి కార్యకలాపాలు నిర్వహిస్తూనే మరోవైపు గత ఐదేళ్లలో రుడాలో జరిగిన అక్రమాలపై దృష్టి పెడతానని తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాలకు కొత్త ప్రాజెక్టులు వస్తాయని చెప్పారు. రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ బొడ్డు వెంకటరమణ చౌదరి నెమ్మదస్తుడన్నారు. కాని ఆయన సాధించాల్సింది చేసి చూపుతారన్నారు. కూటమి నాయకులను కలుపుకుంటూ అభివృద్ధికి బాటలు వేద్దామన్నారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని బొడ్డును సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎంఎల్ఎలు బత్తుల బలరామకృష్ణ, వేగుళ్ల జోగేశ్వరరావు, దాట్ల బుచ్చిబాబు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకట్రాజు, బండారు సత్యానందరావు, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, జనసేన నాయకులు అనుశ్రీ సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

టిడిపి శ్రేణుల భారీ ర్యాలీ

రుడా ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసేందుకు బొడ్డు వెంకటరమణ చౌదరి ఆదివారం బూరుగుపూడి గేటులోని టిడిపి కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా రాజమహేంద్రవరానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా బూరుగుపూడి కార్యాలయం వద్ద బొడ్డు వెంకటరమణచౌదరికి టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ గజమాలను క్రేన్ సహాయంతో వేశారు. టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున బైక్‌లపై ర్యాలీగా బొడ్డు వెంకటరమణచౌదరితో రాజమహేంద్రవరంలోని ప్రమాణ స్వీకార వేదికకు తరలారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి యనమల రామ కృష్ణుడు, ఎంఎల్ఎ బలరామకృష్ణ పాల్గొన్నారు.


ఎంఎల్ఎ బత్తుల, మాజీ మంత్రి యనమలతో బొడ్డు

29న డయాబెటిస్‌పై అవగాహన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 29న అంతర్జాతీయ డయాబెటిస్ అవగాహన కార్యక్రవమాన్ని నిర్వహిసుత్నన్నుమని ప్రిన్సిపల్ రామచంద్ర తెలిపారు. ఇందులో భాగంగా డాక్టర్ ఎంవి.శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో షుగర్ వ్యాధి సంబంధిత పరీక్షలు, థైరాయిడ్ సంబంధిత పరీక్షలను ఉచితంగా చేపడతారన్నారు. ఉదయం 7:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరుగుతుందన్నారు. ఏర్పాట్లను జంతుశాస్త్ర విభాగాధిపతి కె.బాబు, రెడ్ రెబ్బన్ క్లబ్ సమన్వయకర్త జి.రవితేజ పర్యవేక్షిస్తున్నారు. దీన్ని జయప్రదం చేయాలని విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందిని ఆయన కోరారు.

అన్నదానానికి భారీ ఏర్పాట్లు

ప్రజాశక్తి- కడియం

మండలంలోని కడియపులంక శ్రీ అపర్ణ సమేత శ్రీ అనంతేశ్వర స్వామి పంచాయతన క్షేత్రంలో నవంబరు 29న జరిగే భారీ అన్నదానానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తుందని ఆలయ కమిటీ చైర్మన్ మార్గాని సత్యనారాయణ తెలిపారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో వచ్చే మాస శివరాత్రి రోజున వేలాది మంది భక్తులకు మహా అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ ఏడాది చివరి కార్తీక శుక్రవారం మాస శివరాత్రి కావడంతో 40 వేల మందికి అన్నదానం చేయనున్నట్టు తెలిపారు. ఈ మేరకు కడియం సిఐ ఎ.వెంకటేశ్వరరావు ఆలయాన్ని ఆదివారం సందర్శించారు. ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మార్గాని సత్యనారాయణ, పల్లా వెంకటేష్, ఆరేటి భద్రరావు, చెక్కపల్లి గోవిందు, ఆలా పెద్దబాబు, మల్లు రాజు, మల్లు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక స్పృహ, పోరాట పటిమ ఉండాలి

యుటిఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభలో ఎంఎల్‌సి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి -నిడదవోలు

ఉపాధ్యాయులు నిరంతర అధ్యయ నంతో పాటూ సామాజిక స్పృహ, పోరాట పటిమ అవసరమని పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా యుటిఎఫ్ నూతన కౌన్సిల్, స్వర్ణోత్సవ సభ ఆదివారం నిడదవోలు కొత్తపల్లి శ్రీరాములు కనకమ్మ లయన్స్ క్లబ్ ఆడిటోరి యంలో జరిగింది. షేక్ సాబ్జీ ప్రాంగణం, బ్రహ్మాజీ రావు వేదికపై జిల్లా అధ్యక్షులు పి.జయకర్, ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి పాల్గొని మాట్లా డారు. సమ సమాజాన్ని నిర్మించే పౌరుల్ని తయారు చేయాలంటే ఉపాధ్యాయులు అభ్యుదయంగా ఆలోచిస్తూ సాంకేతిక దృక్పథంతో బోధించాలన్నారు. ప్రజా పోరాటాల వల్లే ఏవైనా సాధించుకో గలమన్నారు. 50 ఏళ్ల యుటిఎఫ్ ఉద్యమ చరిత్రలో ఎన్నో విజయాలు ఉన్నాయన్నారు. విద్యార్థులపై పని గంటల పెంపు భారాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆర్థిక స్థితి మెరుగు పడటం వెనుక యుటిఎఫ్ కృషి, ఉద్యమకారుల త్యాగాలు ఉన్నాయ న్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ హక్కులు బాధ్యతలు యుటిఎఫ్ సంఘానికి రెండు కళ్లు అన్నారు. క్రమశిక్షణే యుటిఎఫ్ సంఘానికి ప్రధానాయువు అన్నారు. ప్రభుత్వం నుంచి ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను సాధించడానికి భవిష్యత్తులో జరిగే పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అధ్యక్షులు జయకర్ మాట్లాడుతూ కాకినాడలో జరగనున్న స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలన్నారు. ప్రధాన కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ యాప్‌ల భారం బోధన సమ యాన్ని హరిచేస్తుందన్నారు. పాఠశాలల్లో బోధనేతర పనులను తగ్గించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ మీడియం బాబూరావు నూతన ఆర్థిక విధా నాల గురించి ఉపాధ్యాయులకు వివరించారు. కుల వివక్షత నిర్మూలన సమితి అధ్యక్షులు రాంబాబు మాట్లాడుతూ సమాజంలో అంతరాలు లేని సమా జాన్ని తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యా యులపై ఉందన్నారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ కళాబందం పాడిన పలు సాంస్కృతిక పాటలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఉదయం నిడదవోలు పట్టణంలో యుటిఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు అందించారు. అంతకుముందు అమరులైన యుటిఎఫ్ ఉద్యమకారుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అలాగే జాతీయ పతాకాని సీనియర్ నాయకులు కొప్పుల వెంకటేశ్వర రావు, ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని ఎన్.అరుణకుమారి, యుటిఎఫ్ పతాకాన్ని కె.పార్థసారథి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.వెంకటేశ్వరరావు, కె.పార్థసారథి, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి ఇవివిఎస్.ప్రసాద్, గౌరవాధ్యక్షులు శంకరుడు, ఉపాధ్యక్షులు ఎం.విజయగౌరి, ఐ.రాం బాబు, జిల్లా కార్యదర్శి ఇ.శ్రీమణి, ఎం.శ్రీనివాస్, కె.రమేష్ బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపస్ రావు, రాష్ట్ర కౌన్సిలర్లు, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ మహాసభలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

ప్రదర్శనలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, రాంబాబు తదితరులు

'రాజ్యాంగ పఠనం' కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజ్యాంగాన్ని సామాన్య ప్రజానీకానికి చేరువ చేయడానికి రాజ్యాంగ పఠనం చర్చావేదిక ఎంతగానో ఉపయోగపడుతుందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాజ్యాంగ పఠనంపై అవగాహన కరపత్రాన్ని ఉండవల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సామాన్యుల చెంతకు రాజ్యాంగాన్ని తీసుకువెళ్లాలనే ఆలోచన చేసిన ఆస్క్(అంబేద్కర్ సేవా కేంద్రం) చైర్మన్ జి.రాంబాబు ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు అశోక్‌కుమార్‌జైన్, నైనాల కృష్ణారావు, స్వర్ణాంధ్ర వ్యవస్థాపకులు పడాల రామిరెడ్డి, శ్రీధర్, హరికృష్ణ ప్రసాద్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు. ప్రతి నెల రాజ్యాంగ పఠనం కార్యక్రమం ద్వారా చర్చ వేదికలు ఏర్పాటు చేసి రాజ్యాంగ నిపుణులను పిలిచి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతామని అలాగే విరివిగా కరపత్రాలు పంపిణీ చేయనున్నట్లు ఆస్క్ చైర్మన్ రాంబాబు తెలిపారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాజ్యాంగం రచించి 75 ఏళ్లుపూర్తి అయిన సందర్భంగా ఈనెల 26న నిర్వహించే 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని దళిత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని ఆదివారం రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ స్థానిక తిలక్ రోడ్‌లోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మంగళవారం గోకవరం బస్టాండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించే కార్యక్రమానికి నగరానికి చెందిన ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, వివిధ సంఘాలు, ప్రజా సంఘాలు తరలివచ్చి విజయవంతం చేయాలని దళిత సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి, అజ్జరపు రమేష్, తురకల నిర్మల, మాలే విజయలక్ష్మి, ధారా ఏసురత్నం, ఉసురుమర్తి రామారావు, నామ సత్యనారాయణ, ఎ.కుమార్‌బాబు పాల్గొన్నారు.

డ్రెయినేజీలు లేకుండా సిసి రోడ్లు ఎందుకు?

ప్రజాశక్తి - చాగల్లు

గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మాణం చేపడుతున్నారని, డ్రెయినేజీలు లేకుండా ఈ రోడ్ల నిర్మాణం వల్ల ఉపయోగం ఏంటి అని టిడిపి నాయకులు ఎంపిటిసి సభ్యులు సంసాని సత్యనారాయణ ప్రశ్నించారు. గతంలో పాఠంపేటలో సిపి రోడ్లు నిర్మించి డ్రెయినేజీలను మరిచారన్నారు. అక్కడ ప్రజలు ఇంట్లో గోతులు తీసుకుని నానా అవస్థలు పడుతున్నారన్నారు. కావున డ్రెయినేజీలను నిర్మించి సిసి రోడ్లను వేయాలని కోరారు.

108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలి

ప్రజాశక్తి - చాగల్లు

రాష్ట్రంలోని 108 వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని 108 సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ 108 సిబ్బంది ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా చాగల్లు మండలంలో 108 సిబ్బంది ప్రజా మద్దతును కూడగట్టేందుకు కరపత్రాలను పంపిణీ చేశారు. అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు ఎంతో సేవ చేస్తున్న తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శివ నాగేశ్వరరావు, శ్రీధర్, రమేష్ నాయుడు, సతీష్ పాల్గొన్నారు.

కరపత్రాలిస్తూ మద్దతు కోరుతున్న 108 సిబ్బంది

కార్టూ'నిజం'



18 ఏళ్లు నిండితే ఓటు హక్కు తప్పనిసరి

ప్రజాశక్తి-నల్లజర్ల

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలని, దీనికోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ కృష్ణారావు అన్నారు. ఆదివారం నల్లజర్లలోని జడ్‌పి హై స్కూలు వద్ద ఓటర్ నమోదు కార్యక్రమం ఎపిఎం శ్యాంసుందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీన్ని తహశీల్దార్ పరిశీలించి మాట్లాడారు. రాజకీయాల్లో మార్పు రావాలంటే ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నార. ఈ కార్యక్రమంలో రాధ, మురళీకృష్ణ, మాలిని తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి : కొత్త ఓటర్ల నమోదు కోసం మండలంలో శని, ఆదివారం నిర్వహించిన ప్రత్యేక క్యాంపులో 120 మంది దరఖాస్తు చేసుకున్నారని తహశీల్దార్ రవీంద్రనాథ్ తెలిపారు. మండలంలోని 20 పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబరు 5న జరిగే టీచర్ ఎంఎల్‌సి ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. తాళ్లపూడి మండలంలో 61 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మండలంలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 1,764 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఆయన వెంట గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

కడియంలో అవగాహనా ర్యాలీలో పాల్గొన్న తహశీల్దార్, సిబ్బంది

దేవరపల్లి : మండలంలో గౌరీపట్నం, బందపురం, దేవరపల్లి గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లలో నిర్వహించిన ఓటరు నమోదును తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి ఆదివారం పరిశీలించారు. కొత్త ఓట్లు కోసం 25, మార్పులు చేర్పులు కోసం8, డెత్ డిలీషన్స్ కోసం 13 మంది దరఖాస్తు చేసుకున్నారని ఆమె తెలిపారు.

కడియం : 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ కె.పోసిబాబు తెలిపారు. ఓట్లు నమోదు కార్యక్రమంలో భాగంగా కడియంలో ఆదివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఓటరు లిస్టులో మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం ఉందని, దీన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఎం.నాగభూషణం, కమ్యూనిటి కో-ఆర్డినేటర్లు ఎస్.పద్మారావు, వి.రాజబాబు, విఒఎలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం : ప్రత్యేక ఓటు నమోదు కేంద్రాల్లో మొత్తం ఆరు కొత్త ఓట్ల నమోదుకు అర్జీలు అందాయని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ తెలిపారు. ఆదివారం మండలంలోని తాడిపర్రు, ఉండ్రాజవరం తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటు నమోదు కేంద్రాలను ఆయన పరిశీలించారు. డిలీషన్ కోసం10, సవరణలు, ట్రాన్స్‌ఫర్‌ల కోసం 11 అర్జీలు అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉండ్రాజవరం పంచాయతీ కార్యదర్శి యు.ముత్యాలునాగ్, డిటి, విఆర్‌ఒలు పాపారావు, టి.శ్రీనివాస్, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

డీజిల్ తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

యానాం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ఒక ఆటోను సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అమలాపురానికి చెందిన కుడిపూడి నరేష్, కేతా శ్రీనివాస్ తన ఆటోలో యానాం నుంచి రూ.80 వేలు విలువ గల వెయ్యి లీటర్లు టిన్నుల్లో అక్రమ డీజల్ తరలిస్తున్నారు.నగర పంచాయతీ పరిధిలోని కొండాలమ్మ చింత సమీపంలో ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా వీరు పట్టుబడ్డారు. దీంతో డీజిట్ తరలిస్తున్న ఆటోను సీజ్ చేసి డీజిల్ స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులపై నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి.రాగంపేటలో ఆదివారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

బస్సును ఢీకొన్న కారు

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని మల్లేపల్లిలో ఆదివారం బస్సును కారు ఢీకొన్న సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. ఒక ప్రైవేట్ బస్సు మల్లేపల్లి డివైడర్ వద్ద యూటర్న్ తిరుగుతుండగా దివాన్ చెరువు నుండి అన్నవరం వెళుతున్న కారు బస్సును ఢీ కొంది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు ఉండగా ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో హాస్పిటల్‌కు తరలించారు. రోడ్డుకు అడ్డంగా బస్సు నిలిచి పోవడంతో అధిక సమయం జాతీయ రహదారిపై ఇరు వైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీస్‌లు ట్రాఫిక్‌ని క్లియర్ చేశారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - గోపాలపురం

మనస్తాపానికి గురై వివాహిత ఫ్యాన్‌కి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గోపవరం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గోపవరం గ్రామానికి చెందిన అన్నెం వీరహారిక (20)కు రెండేళ్ల క్రితం తన మేనమామ కుమారుడితో ప్రేమ వివాహం జరిగింది. ఆమెకు ఏడాది వయస్సున్న కుమార్తె ఉంది. వీరి వివాహం జరిగినప్పటి నుంచి తల్లిదండ్రులు చూసేందుకు కూడా రాకపోవడంతో మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలో శనివారం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తల్లి పేరం దుర్గ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ కేసు నమోదు చేశారు. తహశీల్దార్ సిహెచ్.విద్యాపతి సమక్షంలో పంచనామ నిర్వహించారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

దివ్య ఆత్మహత్యపై డిఎస్‌పి దర్యాప్తు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

ఈ నెల 13న భర్త, అత్తమామల అదనపు కట్నం వేధింపులతో దుర్గాడలో రైలు నుండి దూకి ఆత్మహత్య చేసుకున్న తొగరు దివ్య కేసును తుని రైల్వే పోలీసుల నుంచి గొల్లప్రోలు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. దీంతో గొల్లప్రోలు ఎస్ఐ పి.రామకృష్ణ కేసు నమోదు చేశారు. కాకినాడ డిఎస్‌పి రఘువీర్ దర్యాప్తు చేస్తున్నారు. దీంతో ఆదివారం ఆత్మహత్యా ప్రాంతాఇన్న డిఎస్‌పి పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

పోలేకుర్రు, పి.మల్లవరం రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు పోలేకుర్రు గ్రామానికి చెందిన శ్రవణ్ కుమార్ బైకుపై పి.మల్లవరం వెళ్లి తిరిగివస్తుండగా పోలేరమ్మ ఆలయ సమీపంలో తోటపేట గ్రామానికి చెందిన కొంకే సాయి సిద్ధార్థ బైకుపై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శ్రవణ్ కుమార్ తల, మొహం, కాలిపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన తాళ్లరేవు సిహెచ్‌సికి తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేలు ఆడుతున్న నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సాగిపాడు గ్రామ సమీపంలో కోడిపందేల స్థావరంపై ఆదివారం దాడులు నిర్వహించి నలుగురుని అరెస్టు చేశామని ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు. రెండు కోడిపుంజులు, రెండు కోడి కత్తులు, రూ.3,409 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలు చేపడితే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

300 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

నాగులపల్లిలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు నాగులపల్లి సర్పంచ్ ఒడిశెట్టి గౌరీ రాజేశ్వరి నారాయణరెడ్డి తెలిపారు. కిరణ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 50 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఆపరేషన్ అవసరమైన వారికి కాకినాడలో ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న కంటి వైద్యులకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

మార్గానికి పురస్కారం అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

'మార్గాని'కి ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి-కడియం

కడియపులంకకు చెందిన నర్సరీ రైతు మార్గాని సత్యనారాయణకు లయన్స్ క్లబ్ ఉత్తమ సేవా పురస్కారం దక్కింది. పర్యావరణాన్ని కాపాడటంలో నేను సైతం అంటూ పచ్చదనం పరిశుభ్రత పెంపొందించి, కాలుష్య రహిత పాఠశాలల కోసం పాఠశాలల ఆవరణలో వేలాది మొక్కలను నాటించి, వేలాది మంది అనాథలకు నూతన వస్త్రాలు పంపిణీతో పాటు అన్నదానం నిర్వహించి, కోట్లాది రూపాయల విలువ చేసి భూమిని దేవాలయాలకు దానం వంటి పలు సేవాకార్యక్రమాలను ఆయన నిర్వహించారు. ఈ సేవలకు గుర్తింపుగా లయన్స్ క్లబ్ ఉత్తమ సేవా పురస్కారం అందించింది.కడియం మండలం కడియపులంక శ్రీ వీర హనుమాన్ నర్సరీలో జిల్లా 316బి లయన్స్ ఇంటర్నేషనల్ మహిళలు "కుమారి సంభవం" కార్యక్రమాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇవివి.ఈశ్వర్‌కుమార్, లయన్స్ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరరావు, లయన్స్ జోన్ చైర్మన్ కొయ్యన కుమారి, పాస్ట్ డిస్టిక్ గవర్నర్ మాటూరి మంగతాయారు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎ.కవిత, జి.మాధవీలత, అరుణకుమారి, లయన్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సాయం అందిస్తున్న మానవత సభ్యులు

పలువురికి 'మానవత' ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురు పేదలకు వైద్యం ఖర్చుల నిమిత్తం మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూ.10వేల ఆర్థిక సాయం అందించింది. వేళ్లచింతలగూడెంలో కుక్కల గంగాజలం పక్షవాతాని గురయ్యాడు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4వేలను అందించారు. అదే గ్రామానికి చెందిన తొర్లపాటి రాజేంద్రకు డయాలసిస్ నిమిత్తం రూ.3వేలు అందించారు. బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా పక్షవాతంతో బాధపడుతున్న చినరత్తయ్యకు రూ.3వేలు అందించారు. ఈ కార్యక్రమంలో మానవత చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, కో- చైర్మన్ నెల్లి చంద్రశేఖర్, సెక్రెటరీ కుక్కల కీర్తికుమార్, సిఆర్‌పి కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

శ్రామికులకు అండగా ఈ శ్రమ్

అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వలీ

ముఖా ముఖి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఈ శ్రమ్ ద్వారా ప్రతీ ఒక్క శ్రామికుడికి ఎంతో మేలు కలుగనుంది. అసంఘటిత రంగ కార్మికులకు ప్రత్యేకంగా ఈశ్రమ్ పథకం గత 2021 ఆగస్టు 26న ప్రారంభమైంది. ఈ పథకంలో చేరితే అనేక ప్రయోజనాలున్నాయని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బిఎస్ఎం వల్లి తెలిపారు. కార్మిక శాఖ ఆధ్వర్యాన ఈ శ్రమ్ నమోదు కోసం ఇటీవల జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో పలు చోట్ల అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహించారు.

ఈ శ్రమ్ నమోదుకు అవగాహన కార్యక్రమాలు

ఈ శ్రమ్ నమోదుతో అసంఘటిత రంగంలోని ప్రతి ఒక్క శ్రామికునికీ మేలు జరుగుతుంది. ఈ నమోదుతో కార్మికులను గుర్తించి వారికి ఉపాధి కల్పించేందుకు ఈ శ్రమ్ చక్కగా ఉపయోగపడుతుంది. ఈ నేపథ్యంలో పలు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాము. కార్మికులు ఈశ్రమ్ ద్వారా పేర్లను నమోదు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలి. ఈశ్రమ్ వెబ్‌పోర్టల్‌లో నమోదు ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. నేషనల్‌డాటాబేస్ ఆఫ్ అన్ రికగ్నైజ్‌డ్ వర్కర్స్‌ను ఈశ్రమ్ ద్వారా నమోదు జరుగుతోంది.

రూ. 2 లక్షల ఉచిత బీమా..

ఈ శ్రమ్‌లో చేరిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వపరంగా అనేక ప్రయోజనాలు కల్పిస్తున్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందినా, శాశ్వతంగా అంగవైకల్యం కలిగిన వారికి రూ.2 లక్షల బీమా, పాక్షిక అంగవైకల్యం కలిగితే రూ.1 లక్ష బీమా ఉచితంగా అందిస్తూనే ఇతర ప్రయోజనాలు కల్పిస్తారు. ఈశ్రమ్ పోర్టల్‌లో చేరిన ప్రతి అసంఘటిత కార్మికునికి 12 అంకెలు గల ప్రత్యేక గుర్తింపు కార్డు (యూనివర్సల్ ఐడెంటిఫికేషన్ నెంబరు) ఇస్తారు. ఈ కార్డు ఉంటేనే ప్రభుత్వం అందించే అన్నిరకాల సహాయం, సామాజిక భద్రత పథకాలు, సంక్షేమ పథకాలు అందుతాయి. అర్హులైన వారందరూ నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం

ఉచితంగానే నమోదు ప్రక్రియ..

ఈ శ్రమ్ పథకంలో చేరేందుకు ఎలాంటి ఫీజు లేదు. ఉచితంగా కార్మికులు చేరవచ్చు. పేర్లు నమోదు చేసుకునేందుకు కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశం కల్పించాయి. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 3,20,855 మంది కార్మికులు ఈ శ్రమ్‌లో నమోదు చేయించుకున్నారు. అసంఘటిత కార్మికులందరినీ ఈశ్రమ్‌లో నమోదు చేయించడమే లక్ష్యంగా కార్మిక సంక్షేమ శాఖ అధికారులు పని చేస్తున్నారు. అసంఘటిత రంగంలో కార్మికులై ఉండి 16 నుంచి 59 ఏళ్ల వయస్సు లోపు వారు ఇందులో చేరవచ్చు. ఆదాయ పన్ను చెల్లించే వారు, ఇపిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలున్న వారు అనర్హులు.

మీసేవా, సీఎస్‌సి కేంద్రాల్లోనూ నమోదు..

అర్హులైన అసంఘటిత కార్మికులు అందరూ తమ ఆధార్ కార్డు నకలు, బ్యాంకు అకౌంట్ నెంబరు, సెల్ ఫోన్ నెంబరు వివరములతో సమీపములోని గ్రామ/వార్డు సచివాలయాలు, సిఎస్‌సి సెంటర్‌లలో లేదా ఈ శ్రమ్ అధికారిక పోర్టల్‌లో ఉచితంగా సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం ఉంది. వెంటనే యాప్ యుఎఎన్‌తో కూడిన ఈశ్రమ్ కార్డును జారీచేస్తారు. ఆధార్‌తో లింకై ఉన్న ఫోన్ నెంబరు, బ్యాంకు అకౌంటు వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. యుఎఎన్ ఉన్న ప్రతి ఒక్కరికీ పిఎంఎస్‌బివై పథకం కింద రూ.2 లక్షలు, అంగవైకల్యం బీమా ఉచితంగా అందజేస్తారు. ఎలాంటి వివరాలు అవసరమైనా, లేదా అనుమానాలను నివత్తి చేసుకునేందుకు సంబంధిత కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించాలి.

ఈ శ్రమ్‌ను కార్మికులకు ఒక వరం..

ఈశ్రమ్ కార్యక్రమం శ్రామికులకు ఒక వరం లాంటిది. ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలి. అనేక ప్రయోజనాలున్న ఈశ్రమ్ పథకం అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టారు. అన్ని రంగాల కామన్ సెంటర్లలోనూ ఈశ్రమ్‌లో పేర్లు, వివరాలు నమోదు చేస్తారు. ఈశ్రమ్ కార్డు పొందితే ప్రభుత్వం అందించే అన్ని రకాల ప్రయోజనాలు చేకూరే అవకాశాలున్నాయి.

వారి కలయిక ఆపాత మధురం

40 ఏళ్ల తరువాత కలిసిన విద్యార్థులు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వారి కలయిక అపూర్వం.. వారి జ్ఞాపకాలు ఆపాత మధురం... నాలుగు దశాబ్దాల తరువాత వారందరూ ఒక్కచోట కలిశారు. 40 ఏళ్ల క్రితం నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందగా గడిపారు. ఈ పూర్వ కలయికకు మోర్త గ్రామం వేదికగా నిలిచింది.ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1980వ సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం మోర్త గ్రామంలో గెట్ టు గెదర్ నిర్వహించుకున్నారు. ఆరు పదుల వయసుకు చేరువలో ఉన్న వారు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అప్పటి అనుభూతులు, అనుభవాలు పంచుకున్నారు. తమతో పాటు చదువుకుని, వివిధ కారణాలతో కాలం చేసిన స్నేహితులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వాహకులు, పశ్చిమగోదావరి జిల్లా ఛీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ కంటిపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ రోజును ఎప్పటికీ మర్చిపోనన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్, విశాఖపట్నంలలో ల్యాబ్స్ నిర్వహిస్తున్న రాజు, సి.శ్రీమన్నారాయణ, విజయవాడ కోర్టు సూపరింటెండెంట్ మడిపల్లి శ్రీనివాసరావు, విశ్రాంత టీచర్ కుంకట్ల వెంకటరత్నం, మాజీ సర్పంచులు కుదప రమేష్, మట్టపర్తి అచ్యుత రామన్న, సిహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు..

ఉత్సాహంగా వన సమారాధనలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

కార్తీక మాసంలో చివరి ఆదివారం కావడంతో వన సమారాధనలు ఉత్సాహంగా సాగాయి. ఖాళీ ప్రదేశాలు, కొబ్బరి తోటలు, కోకో తోటలు యాత్రికులతో నిండిపోయాయి. సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తూ ఉసిరి చెట్టు కింద ప్రత్యేక పూజలతో కొందరు, వాటిని కాదంటూ ఆధునికతను సంతరించుకున్న విద్యార్థులు, ఇలా ఎవరికి వారు ఏర్పాటు చేసుకున్న పిక్నిక్‌లతో ఆదివారం మండలం మొత్తం సందడిగా కనిపించింది. ఆటపాటలు, డ్యాన్సులు కేరింతలతో దద్దరిల్లాఇయ. వడ్లూరు లో ఆర్యవైశ్యులు ఏర్పాటు చేసిన వన సమారాధన వద్ద తల్లిదండ్రుల విశిష్టతను తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

'పార్డ్ ఇండియా' ప్రజలకు అంకితం

ప్రజాశక్తి-నల్లజర్ల

పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థను ప్రజాహిత కార్యక్రమాలకు అంకితం చేసేందుకు ఆ సంస్థ నల్లజర్ల మండల ప్రధాన కార్యవర్గం నిర్ణయించింది. ఆదివారం సంస్థ ప్రధాన కార్యాలయంలో అధ్యక్షులు మహ్మద్ ఇలియాస్ షరీఫ్ అధ్యక్షత కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. సంస్థ దశాబ్ద కాలంగా అనేక ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టి అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలు, మన్ననలు పొందడం ఆనందదాయకమన్నారు. ఇప్పటికే విద్యార్థులకు అనేక విషయాల్లో అవగాహన కలిగిస్తూ, టాలెంట్ టెస్ట్‌లూ, స్కాలర్‌షిప్ టెస్ట్‌లు నిర్వహిస్తూ నగదు బహుమతులిస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. అదే స్ఫూర్తితో ప్రారంభించిన 'బడి తర్వాత విద్యా బోధన' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని సంస్థ విద్యా విభాగం ఛైర్మన్ బొండల శ్రీనివాసరావు వెల్లడించారు. పవర్ ఆఫ్ సూవింగ్ పేరిట నల్లజర్లలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ సూపర్ సక్సెస్ అయ్యిందని సంస్థ మహిళా విభాగం అధ్యక్షులు, నభీపేట సర్పంచ్ గోతం సత్యలక్ష్మి తెలిపారు. పార్డ్ ఇండియా జాతీయ అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు కృషితో సంస్థకు అంబులెన్సు, శీతల శవపేటిక, కైలాసరథం త్వరలోనే అందుబాటులోకి రానున్నాయని సంస్థ ప్రధాన కార్యదర్శి కూరపాటి నాగరాజు చెప్పారు. ప్రజాసేవే పరమావధిగా తమ పార్డ్ ఇండియా పనిచేస్తుందని సంస్థ కోశాధికారి జీ.వీ.వీ.ప్రసాద్ పేర్కొన్నారు.

ఐఎంఎల్ డిపోలో తనిఖీలు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు ఎపి ఎస్‌బిసిఎల్ ఐఎంఎల్ డిపోలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ చైతన్యకృష్ణమురళి ఆదివారం తనిఖీలు నిర్వహించారు. డిపో మౌలిక వసతులపై ఆరా తీశారు. ఎగుమతులు దిగుమతులు, హమాలీల ఇన్సూరెన్స్ తదితర అంశాలపై చర్చించారు. ఆయన వెంట డిఎం ఎం.రామకృష్ణదాసు, డిపో ఎక్సైజ్ సిబ్బంది సిఐ శ్రీలక్ష్మి, ఎస్ఐ ఆర్.సురేష్‌కుమార్, హమాలీలు పాల్గొన్నారు.

'బొడ్డు'కు సువర్ణరాజు శుభాకాంక్షలు

ప్రజాశక్తి -దేవరపల్లి

రాజమహేంద్రవరం రూడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బొడ్డు వెంకటరమణచౌదరిని జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు కలిసి అభినందనలు తెలిపారు. రాజమహేంద్రవరాన్ని అదేవిధంగా చుట్టుపక్కల ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయాలన్నారు. రానున్న పుష్కరాల నాటికి ఉభయ గోదావరి జిల్లాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు అనిశెట్టి గంగరాజు, ఠాగూర్, రఫెల్ పాల్గొన్నారు

మహాధర్నా జయప్రదానికి ప్రచారం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

కాకినాడలో సోమవారం నిర్వహించే రైతు, కార్మిక, దళిత, చేతి వృత్తుల మహా ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం సిఐటియు నాయకులు గుర్రాల అప్పారెడ్డి, కాళ్ల నాగేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా ఆదివారం రమణక్కపేటలో రైతులకు కరపత్రాలను అందజేశారు. గ్రామంలో పర్యటించి రైతులు, కౌలు రైతులను కలిశారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను నాయకులకు వివరించారు. ధాన్యానికి మద్దతు ధర రావడం లేదని, కొనుగోలు కేంద్రాలు ఎక్కడున్నాయో కూడా తెలియదని, గోనె సంచులు లేవని, ప్రభుత్వ అధికారులు ఎవరూ కనబడడం లేదని రైతులు ఆవేదన చెందారు. గతంలో వచ్చిన ఏలేరు వరదల వల్ల గ్రామంలో పంట పొలాలు అన్నీ మునిగిపోయాయని, దీంతో దిగుబడి బాగా తగ్గిందని తెలిపారు. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. కౌలు రైతులు మరీ తీవ్రంగా నష్టపోయారని ఆవేదన చెందారు. నేటికీ పెదఏరుకు పడ్డ గండ్లకు మరమ్మతులు చేయలేదని చంద్రబాబు ఇస్తానన్న అన్నదాత సుఖీభవ రూ.20,000 సాయం ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. రైతులు ధాన్యం ఆరబెట్టుకోవడానికి కనీసం స్థలం కూడా లేదని కావున ప్రభుత్వం స్థలాలు ఇప్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కె.సూరిబాబు, రాము, సత్తిబాబు, కాళ్ల గోవిందు, నూకిరెడ్డి సుబ్బారావు రైతులు పాల్గొన్నారు.

పలువురికి మాజీ ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - బిక్కవోలు

బలభద్రపురం గ్రామంలో ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందిన తాడి సూరారెడ్డి కుటుంబ సభ్యులను అనపర్తి మాజీ ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందినగుత్తుల విజయనాగేంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఆయన వెంట వైసిపి నాయకులు కొవ్వూరి వెంకటరామారెడ్డి, ఎల్ఐసి శీను, మట్ట రాంబాబు ఉన్నారు.

గోడ పత్రికను ఆవిష్కరించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - బిక్కవోలు

బిక్కవోలు సుబ్రహ్మణ్యం స్వామి షష్టికి సంబంధించిన గోడ పత్రికలను అనపర్తి ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిక్కవోలులో సుబ్రహ్మణ్య షష్టిని ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. చాళుక్యుల కాలం నుంచి ప్రాచుర్యం పొందిన ఆలయాన్ని టెంపుల్ టూరిజంలో భాగంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పడాల వెంకట రామారెడ్డి, శివ రామకృష్ణరాజు, పల్లి వాసు, త్రిమూర్తులు, చౌదిరి, పాల్గొన్నారు.

మున్సిపాలిటీలకు పన్నులు చెల్లించని ప్రభుత్వాలు

ప్రజాశక్తి-కాకినాడ

మున్సిపల్ కార్పొరేషన్‌లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు చెల్లించడం లేదని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. ప్రజల నివాస, వాణిజ్య భవనాల నుండి ప్రతి 6 నెలలకు ఇంటి పన్నులు వసూలు చేస్తున్న తీరుగా జాప్యం జరిగితే నూటికి రూ.రెండు అపరాధ రుసుముతో వసూలు చేస్తున్న రీతిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ భవనాల నుండి బకాయి పడిన రూ.కోట్ల మున్సిపల్ పన్ను వసూలు చేయాలని డిమాండ్ చేశారు. కాకినాడ నగర పాలక సంస్థకు కేంద్ర ప్రభుత్వ భవనాల నుండి ఆయా శాఖల ద్వారా రూ.12 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ భవనాల నుండి సంభందిత శాఖల ద్వారా రూ.42 కోట్లు 22 ఏళ్లుగా బకాయి ఉన్నట్టు తెలిపారు. 2024-25 రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వ శాఖలకు నిధులు కేటాయించారని ఇదే తీరుగా 2002 నుండి ప్రతి ఏడాదీ ప్రభుత్వ బడ్జెట్‌లో ఉమ్మడి ఆంధ్రాకాలం నాటి నుండి కేటాయింపులు జరుగుతున్నా వాటిని విడుదల చేయడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ప్రంచాయితీలకు ఇవ్వాల్సిన నిధులను ఇతర పనులకు మళ్ళించకుండా విడుదల చేసిన రీతిగా నగర పట్టణాల్లోని మున్సిపల్ కార్పొరేషన్ సంస్థలకు జమ చేయాల్సిన ప్రభుత్వ భవనాల మున్సిపల్ పన్ను బకాయిలను కనీసంగా విడతల వారీగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ వాహనాలకు రోడ్డు పన్ను, విద్యుత్ వాడకానికి కరెంటు బిల్లు, ప్రతి రూపాయికీ జిఎస్‌టి, భూమి పన్ను, గ్రంథాలయ సెస్సు, ఫోన్ బిల్లు, పోస్టల్ బిల్లు మున్నగు అన్ని పన్నులూ చెల్లిస్తున్నా కార్పొరేషన్‌కు మాత్రం ప్రభుత్వ శాఖల నుంచి ఆస్తి పన్నులు చెల్లించడం లేదన్నారు. తాగునీరు సరఫరా చేస్తున్నప్పటికీ నీటి పన్నులు చెల్లించడం లేదన్నారు. ప్రజలకు ఉచితంగా సేవ చేసే ప్రభుత్వ శాఖలకు ప్రజలు చెల్లించే పన్నుల ద్వారా కొనుగోలు చేసే వస్తువుల మీద పన్ను రాబడి ద్వారా ఆయా శాఖలకు వార్షిక బడ్జెట్ కేటాయింపు వుండగా వాటిని విడుదల చేయకుండా స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ సంస్థలను ఆర్థికంగా నిర్వీర్యం చేయడం పద్ధతి కాదన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి ఇతర శాఖల నుండి రావాల్సిన బకాయిల గురించి కృషి చేయడం లేదన్నారు. కార్పొరేషన్ అధికారులు రెడ్ నోటీసులతో మున్సిపల్ చట్టం ప్రకారం జప్తు చేయడం ద్వారా బకాయిలు రాబట్టే చొరవ చేయడం లేదన్నారు. ఇంటిపన్నుల ఆదాయంతో జీతాలు పొందుతున్న కార్పొరేషన్ అధికారులు ప్రభుత్వం నుండి బకాయిలు వసూలు చేయడంలో ముందడుగు వేయడం లేదన్నారు. ప్రజాహిత ప్రయోజనం ద్వారా హైకోర్టును ఆశ్రయించేందుకు సమావేశం పెడతామన్నారు.

పూర్వ విద్యార్థుల వన సమారాధన

ప్రజాశక్తి-కడియం

ఎక్కడెక్కడో స్థిరపడి వివిధ హోదాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు, వ్యవసాయాలు చేసుకుంటున్న పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక గాంధీ నర్సరీలో కార్తీక వన సమారాధన జరుపుకున్నారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982-83 సంవత్సరం పదో తరగతి పూర్తి చేసుకున్న వారు కటుంబ సభ్యులతో కలిసి ఈ వనసమారాధనలో పాల్గొన్నారు. ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. తమతో పాటు చదువుకుని ఉపాధ్యాయ వత్తిలో కొనసాగుతూ జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందుకున్న వర్ధనపు కృపావతిని పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గట్టి నరసయ్య, పాతంశెట్టి రవి కటిక రెడ్డి త్రిమూర్తులు, రంపం వెంకటేశ్వరరావు, కర్రీ యోహాను, మార్ని తమ్మారావు, చిక్కాల సూరిబాబు, గుణ్ణం చిదానందం, మద్దుకూరి పోలారావు ఎలిజిబెత్ రాణి, కష్ణవేణి, సత్యవతి, రాజ్యలక్ష్మి, మణి కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న స్నేహితులు

కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఇటీవల రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఏలేశ్వరం వార్డ్ కౌన్సిలర్ మూది నారాయణస్వామిని ఆదివారం పట్టణ మార్కెట్ జట్టు యూనియన్ కార్మికులు సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మూది నారాయణస్వామి మాట్లాడుతూ తూర్పు కాపులను రాష్ట్ర ప్రభుత్వం బిసి-డిగా గుర్తించినా ఒబిసి సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో వేలాది మంది నిరుద్యోగ యువకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఒబిసి సర్టిఫికెట్లు నిలుపుదల చేయడం వల్ల కేంద్ర ప్రభుత్వ సంస్థలైన పోస్టల్, రైల్వే, ఎయిర్‌ఫోర్స్ వంటి సంస్థల్లో తూర్పు కాపులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయ నగరం జిల్లాల్లో తూర్పు కాపులకు ఒబిసి సర్టిఫికెట్లు ఇస్తుండగా ఉభయ గోదావరి జిల్లాల్లో ఇవ్వక పోవడం అన్యాయం అన్నారు. ఈ విషయాన్ని తూర్పు కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాల్వంచ యశస్విని దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ జట్టు యూనియన్ నాయకులు తాండ్రోతు సత్తిబాబు, గెద్ద రాము, కంచుబోయిన నాగేశ్వరావు, గొల్లపల్లి బాబూరావు, కంది సత్తిబాబు, నోమ్ము రాజు గెద్ద వెంకన్న పాల్గొన్నారు.

నారాయణ స్వామిని సత్కరిస్తున్న కార్మికులు, యూనియన్ నాయకులు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు రాజమహేంద్రవరం
O.S.No.297/2024
Between:
Indian Bank being represented by It's Assistant General Manager, Main Branch.Main Road, Innespeta, Rajamahendravaram
...Plaintiff
AND
1) M/s. Sai Srinivas Agencies rep by its proprietor Koppisetty Satya Srinivas, Son of Veera Venkata Satyanarayana, age years, D No.36-16-21, Near Manikanta Lab, Stadium RoadRajamahendravaram - 533 101.
2) Sri Koppisetty Satya Srinivas, Son of Veera Venkata Satyanarayana, aged years,D No.36-16-21, Near Manikanta Lab, Stadium Road Rajamahendravaram - 533 101
...Defendants
పై నంబరు దావాలో 1,2 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది.03-12-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి బి.వి.రమణరావు
24-11-2024 అడ్వకేట్,రాజమండ్రి

BEFORE THE STATE CONSUMER DISPUTE REDRESSAL COMMISSION OF ANDHRA PRADESH AT VIJAYAWADA
FIRST APPEAL No: 610 OF 2024
Between:
1. M/s. Aditya Builders, Represented by its Managing Partner, Mällisetti Sekhar Kumar,
2. Mallisetti Sekhar Kumar, S/o. Late Satyanarayana Kumar,
....Appellant/Opposite Party
Vs
Nadiminti Surya Seshalaxmi
....Respondents/Complainant
RESPONDENT ADDRESS:
Nadiminti Surya Seshalaxmi, W/o. late Agnihotrisastry, age 70 years, Hindu, Housewife, D. No. 8-13/3-7/2, Pratapnagar, Shirdisai street, Kakinada-4, E.G. District.
The above Appeal is filed by Appellant before the Hon'ble AP State. Consumer Disputes Redresal Commission at Vijayawada against Respondent/complainant. The Appeal is posted for your appearance of Respondent **on 30-12-2024 at 10.30 AM.** Respondent is advised to appear in person or with his Advocate for objections if any in the Appeal, failing which the Hon'ble State Commission may be pass appropriate order against you. This notice is issued according to the Orders of this Hon'ble State Commission on 13-11-2024.
DATE OF ADJOURNMENT: 30/12/2024, AT: 10.30 AM
JU BHASKRAM, Y S V PRATAP,
SPR KUMAR, RM VRR
(AP/2752/2007)
RAO & RAO ASSOCIATES, ADVOCATES, VIJAYAWADA.
8500014509